తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## స్పందనకు 243 అర్జీలు

చిత్తూరు, జనవరి 30 ప్రభాతవార్త:



ప్రజా సమస్యలను పరిష్కరించడానికి కలెక్టర్ హరినారాయణన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి ప్రజలు సమస్యలపై 243 అర్జీలను అందజేశారు. ఈ అర్జీలను పరిశీ లించిన కలెక్టర్ హరినారాయణన్ సత్వరం పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ హరినారాయణన్ జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్, డిఆర్ఓ రాజశేఖర్‌లతో కలిసి స్పందన కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖకు సంబంధించి 147, డిఆర్‌డిఎ 80, వైద్య ఆరోగ్యశాఖ, ఎక్సైజ్, చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్, ఇరిగేషన్, భూగర్భ గనులు, జడ్పీ, ఉపాధి కల్పన, డ్వామాలకు సంబంధించి ఒకొక్క అర్జీ అందాయి.



సోమవారం సాయంత్రం శ్రీహరికోట చేరుకున్న భూపరిశీలనా ఉపగ్రహం ఈఓఎస్. దీనిని త్వరలో పిఎస్ఎల్‌విసి55 రాకెట్ ద్వారా దీనిని ప్రయోగించనున్నారు.

ప్రభాతవార్త - శ్రీహరికోట (తడ)



# అమర్‌రాజా ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం

- షార్ట్‌సర్క్యూట్ కారణంతో చెలరేగిన మంటలు
- అదుపు చేయడానికి శ్రమిస్తున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు
- చిత్తూరుతో పాటు పాకాల, పలమనేరుల నుండి ఫైర్ ఇంజన్లు రాక
- ఫ్యాక్టరీలో పేలుతున్న బ్యాటరీలు

చిత్తూరు, జనవరి 30 ప్రభాతవార్త: యాదమరి మండలం మోర్థానపల్లి గ్రామ పరిసరాల్లోని అమర్‌రాజా బ్యాటరీస్ ఫ్యాక్టరీలో సోమవారం రాత్రి ఘోర అగ్నిప్రమాదం జరిగింది. ఫ్యాక్టరీలో రాత్రి 7 గంటల సమయంలో చిన్న నిప్పురవ్వ రాసుకోవడంతో ఇది పెద్ద అగ్నిప్రమాదంకు దారి తీసింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తోనే ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం జరిగిందని ఫ్యాక్టరీ వర్గాలు పేర్కొంటున్నారు. అయితే ఇప్పటి వరకు అగ్ని ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరుగలేదు. ఈ అగ్ని ప్రమాదంలో భారీ ఎత్తున ఆస్తి నష్టం జరిగింది. మోర్థానపల్లి అమర్‌రాజా బ్యాటరీస్ ఫ్యాక్టరీలోని ఓ బ్లాక్‌లో సోమవారం రాత్రి ఏడు గంటలకు మంటలు చెలరేగాయి. ఈ బ్లాక్‌లో రేగిన మంటలను అదుపు చేయడానికి ప్రయత్నించడంతో పాటు అక్కడ విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది పెద్దగా కేకలు వేస్తూ ఫ్యాక్టరీ వెలుపలికి పరుగులు తీశారు. అప్పటికే ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం జరిగిందని నిర్థారించిన ఫ్యాక్టరీ అధికారులు హుటాహుటిన చిత్తూరులోని ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. అలాగే యాదమరి పోలీస్ స్టేషన్‌తో పాటు చిత్తూరు డిఎస్పీ కార్యాలయంకు సమాచారం అందించారు. ఈ మేరకు చిత్తూరు ఫైర్ ఆఫీసర్ కరుణాకర్



ఆధ్వర్యంలో ఫైర్‌మెన్లు ఫైర్ ఇంజన్లతో బయలుదేరి సంఘటనా స్థలం చేరుకొని ఫ్యాక్టరీలో ఎగసి పడుతున్న మంటలను ఆర్పే ప్రయత్నాలు చేపట్టారు. ఫ్యాక్టరీలో పెద్ద ఎత్తున మంటలు ఎగసి పడుతుంటం, ఫ్యాక్టరీలోని వివిధ బ్లాకుల్లో నిల్వ వున్న బ్యాటరీలు మంటల్లో పేలుతుండటంతో మంటలు ఎగిసిపడ్డాయి. బ్యాటరీల్లో ఆసిడ్ వుండటంతో మంటలకు ఆసిడ్ తోడు కావడంతో ఫ్యాక్టరీ మొత్తం మంటల్లో చిక్కుకొంది. ఈ మంటలను ఆర్పడం తమ వల్ల అయ్యేపని కాదని నిర్ధారించిన ఫైర్, పోలీసు అధికారులు హుటాహుటిన పలమనేరు, పాకాల ఫైర్ స్టేషన్లకు సమాచారం అందించారు. అర్ధగంట వ్యవధిలో మంటల్లో చిక్కుకొన్న అమర్‌రాజా ఫ్యాక్టరీలోకి రెండు ఫైర్ ఇంజన్లు చేరుకొన్నారు. ఫైర్ సిబ్బంది, పోలీసులు, కార్మికులు కలిసికట్టుగా ఎఫ్యాక్టరీలో ఎగిసి పడుతున్న మంటలను అర్పడానికి శాయశక్తులా ప్రయత్నిస్తున్నారు. అయితే అప్పటికే ఫ్యాక్టరీలో పెద్ద ఎత్తున మంటలు చెలరేగడం, ఇప్పటికే ఫ్యాక్టరీలోని పలు బ్లాకుల్లో బ్యాటరీలు వుండటం, వాటిలో ఆసిడ్ నిల్వలు వుండటంతో మంటలు మరింత ఎగిసి పడుతున్నారు. ఈ మేరకు సోమవారం అర్ధరాత్రి లేదా మంగళవారం తెల్లవారుజాముకు ఫ్యాక్టరీలోని మంటలు అదుపులోకి వచ్చే అవకాశం వుంది. ఇక్కడ చిత్తూరు నగర డిఎస్పీ శ్రీనివాసమూర్తి, ఇన్స్‌పెక్టర్లు నరసింహరాజు, భాస్కర్‌లు, ఫైర్ ఆఫీసర్ కరుణాకర్, యాదమరి ఎస్ఐ సుమన్, చిత్తూరు టుటౌన్ ఎస్ఐ మల్లికార్జున్. పోలీసులు, ఫైర్ సిబ్బంది మంటలు ఆర్పడానికి కృషి చేస్తున్నారు.

### సిబిఐ నుండి రక్షించాలంటూ
# ఢిల్లీ పెద్దల దగ్గర మెడలువంచిన జగన్
## సిఎంపై నారా లోకేష్ ధ్వజం



పలమనేరు, వి.కోట, జనవరి 30, ప్రభాతవార్త:

కేంద్ర ప్రభుత్వ మెడలువంచి ప్రత్యేక హోదా తీసుకువస్తానన్న ముఖ్యమంత్రి ప్రస్తుతం సిబిఐ నుండి తనను రక్షించాలని ఢిల్లీ పెద్దల దగ్గర ఆయన మెడలువంచుకున్నారని తెలుగు దేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. యువగళం పాదయాత్రలో భాగంగా సోమవారం పలమనేరు నియోజకవర్గంలోని వి.కోట మండలానికి ఆయన చేరుకున్నారు. వి.కోట మండలం అన్నవరంలో మాజీ మంత్రి అమరనాథరెడ్డి ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు గజమాలలతో ఆయన ఘన స్వాగతం పలికారు. అనంతరం గంధారమాకులపల్లెలో వడ్డెర సంఘం సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.10 ఇచ్చే కార్యక్రమాలపై నవ్వుతున్న జగన్ బొమ్మ ఉంటుందని, ప్రజల నుండి రూ.100లాక్కునే కరెంట్ బిల్లు, ఆర్టీసి టికెట్, చెత్త పన్ను, ఇంటి పన్ను తదితర కార్యక్రమాలపై మాత్రం ఆయన బొమ్మలు ఎందుకుండదని ప్రశ్నించారు. వడ్డెరలను సమస్యల బయటపడేసేందుకు గతంలో చంద్రబాబు సత్యపాల్ కమిటీని వేశారని ఆ కమిటీ నివేదికను జగన్ ప్రభుత్వం ఎందుకు దాచిపెట్టిందని ప్రశ్నించారు. చంద్రబాబు పాలనలో వడ్డెర ఫెడరేషన్ ను ఏర్పాటు చేసి రూ.70కోట్లు ఖర్చు చేశారని, జగన్ పాలనలో వడ్డెర కార్పొరేషన్‌ను నుండి ఎలాంటి సంక్షేమ పథకాలు లేవని విమర్శించారు. ఎస్టీలో ఉండాల్సిన వడ్డెరలను బీసీలో పెట్టారని పేర్కొన్నారు. క్వారీలు తీసుకుని రాళ్లు కొట్టుకుని అమ్ముకోవడం వడ్డెరల కులవృత్తి అని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వారి నుండి క్వారీలను లాగేసుకున్నారని విమర్శించారు. వడ్డెరలు ప్రమాదవశాత్తు చనిపోతే చంద్రన్న భీమా పథకం ద్వారా రూ.5లక్షలు వచ్చేవని సహజ మరణమైతే రూ.2లక్షలు వచ్చేవని, ఇప్పుడు ప్రభుత్వం ఏ ఒక్క కార్పొరేషన్‌లోను నిధులు లేకుండా చేసిందని విమర్శించారు. ముఖ్యమంత్రి ఓ వైపు నుండి రాష్ట్రానికి తాకట్టు పెట్టుకుంటు వస్తున్నారని ఇప్పటికే ప్రభుత్వానికి పాలన తలకు మించిన భారంగా మారిందని రాష్ట్రానికి ఆదాయ వనరులు లేకుండా చేసిన ప్రభుత్వం ప్రస్తుతం ఫలితం అనుభవిస్తుందని పేర్కొన్నారు. ఉద్యోగులకు జీతాలు సకాలంలో ఇవ్వలేని పరిస్థితి మన రాష్ట్రంలో ఉందన్నారు.

**దేశ,రాష్ట్రష భవిష్యత్తు యువతపై ఆధారపడి ఉంది:**

వి.కోట జిఎంఆర్ కల్యాణ మండపంలో యువతతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ దేశ, రాష్ట్ర భవిష్యత్తు యువతపై ఆధారపడి ఉందని అటువంటి యువత నేడు మన రాష్ట్రంలో ఉపాధి లేక రోడ్డునపడ్డారని దీనికి వైకాపా సమాదానం చెప్పాల్సి ఉందని తెలిపారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే యువతకు ఉపాధి, రాష్ట్రంలో పరిశ్రమలు పెట్టుబడులు కావాలని అయితే ప్రభుత్వం వాటిని మరచి పోయిందన్నారు. యువత రాష్ట్రంలో ఉపాధిలేక ప్రక్క రాష్ట్రాలకు వలసలు వెళుతుంటే ప్రభుత్వం రాష్ట్రానికి పరిశ్రమలు తీసుకుంరావడంలో విఫలమైదని విమర్శించిరు. 67 సంవత్సరాలుగా ఏపీని పలువురు ముఖ్యమంత్రులు బాగుచేస్తూ వచ్చారని అయితే జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక రాష్ట్ర అభివృద్ధిని రివర్స్ గేర్ వేసి వెనక్కి శరవేగంగా తీసుకువెళుతున్నారని విమర్శించారు.

**తాడేపల్లె ప్యాలెస్‌లో పిల్లిగా దాక్కున్న మఖ్యమంత్రి ప్రజల మధ్యకు రారా...!**

తాడేపల్లె ప్యాలెస్‌లో దాక్కున్న పిల్లి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల మధ్యకు రారా అని ప్రశ్నించారు. ఆయన ప్రజల మధ్యకు రావాలంటే అధికారులు రోడ్లపై పరదాలు కప్పాల్సిన పరిస్థితి ఎందుకొస్నిందని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే కేంద్రం మెడలువంచి ప్రత్యేక హోదా తీసుకువస్తా అన్న ఆయన ప్రస్తుతం తలలు వంచి ఢిల్లీ వెళ్లి ఢిల్లీ పెద్దల కాళ్లు మొక్కుడం తప్ప రాష్ట్రం కోసం నోరెత్తిన పరిస్థితి లేదన్నారు. ఎన్నికల ముందు యువతకు ఇచ్చిన హామీలేమయ్యాయి తాడేపల్లె ప్యాలెస్ పిల్లి అన్ని ప్రశ్నించారు. యువతకు జాబ్ క్యాలెండర్ ద్వారా 3లక్షల ఉద్యోగాలు ఇస్తానని చెప్పి జాబ్ లెస్ క్యాలెండర్ ఇస్తున్నారన్నారు. రాష్ట్రాభివృద్ధి ఉద్యోగ, ఉపాధి కల్పనలో చంద్రబాబు బ్రాండ్ అయితే కంపెనీలు, పరిశ్రమలను తరిమేయడంలో జగన్ బ్రాండ్ అని విమర్శించారు.

### క్రీడా రంగం అభివృద్ధికి
# తాను ఎప్పుడూ ముందుంటా
- మంత్రి రోజా



మంత్రి రోజాని సత్కరిస్తున్న దృశ్యం

నగరి, పుత్తూరు, జనవరి 30 ప్రభాతవార్త:

మంత్రి రోజా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సభ్యురాలుగా నియమితులయ్యారు. ఈ మేరకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా కార్యదర్శి జతిన్ నర్వాల్ నుంచిసోమవారం ఆమెకు ఆదేశాలు అందాయి. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సభ్యురాలుగా నియమితులు కావడాన్ని పురస్కరించుకుని సోమవారం ప్రజాప్రతినిధులు, అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు ఆమెను దుస్సాలువలతోను, పూల దండలతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. నాయకులు సిద్ధం చేసిన కేక్‌ను కట్ చేసి ఆమె అందరికి పంచారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ క్రీడా రంగం అభివృద్ధికి తాను ఎప్పుడు ముందుంటానన్నారు. క్రీడలంటే తనకు ఎంతో ఇష్టమని ఆ రంగంలోనే పదవులు తనను వరిస్తోందన్నారు. ఉన్న అవకాశాలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకుని క్రీడా రంగం ఉన్నతికి పాటు పడతానన్నారు. జగనన్న క్రీడా సంబరాలు, సీఎం కప్ పోటీలు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడలు అంటూ క్రీడాకారులకు అత్యున్నత ప్రోత్సాహం అందిస్తున్నామన్నారు. పలు ప్రాంతాల్లో క్రీడాకారులకు మైదానాలు సిద్ధం చేసి అందించడంతో పాటు తన ట్రస్టు ద్వారా క్రీడాకారులకు సామగ్రిని వితరణగా అందించడం జరిగిందన్నారు. ఈ సహకారం ఎప్పుడూ కొనసాగుతూ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రారెడ్డి, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, ఎంపీపీ భార్గవి, పీఏసీఎస్ అధ్యక్షుడు తిరుమలరెడ్డి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి సురేష్, దయానిధి, బీడీ భాస్కర్, మునికృష్ణారెడ్డి, వైస్ చైర్మన్‌లు, వైస్ ఎంపీపీలు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కో-ఆప్షన్ సభ్యులు, పీడీలు, పీఈటీలు, ఆలయ కమిటీల సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# జిల్లాలో మూడో విడత జగనన్న చేదోడు

-రజక, నాయిబ్రాహ్మణ, దర్జీలకు రూ.10.813 కోట్లు లబ్ది
- తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి



తిరుపతిరూరల్, జనవరి30 ప్రభాతవార్త:

తిరుపతి జిల్లాలో జగనన్న చేదోడు పథకం కింద రజక, నాయిబ్రాహ్మణ, దర్జీలకు రూ.10.813 కోట్ల రుపాయాలు లబ్ది చేకూరిందని కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి తెలిపారు. మూడో విడత జగనన్న చేదోడును సోమవారం పల్నాడు నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్.జగన్మోహన్‌రెడ్డి బటన్ నొక్కి ప్రారంభించారని, కలెక్టరేట్ నుండి సంబంధిత అధికారులతో కలెక్టర్ పాల్గొన్నట్లు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ పేద ప్రజలు అధిక వడ్డీలకు ఇతరులను ఆశ్రయించరాదని, ఆర్థికంగా ఎదగాలనే సదుద్దేశ్యంతో కులవృత్తులు చేసుకునే దుకాణాలు కలిగిన రజక, నాయిబ్రాహ్మణ, దర్జీ అన్నదమ్ములు, అక్కచెల్లమ్మల సంక్షేమం కోసం అర్హత కలిగిన లబ్దిదారులకు సంవత్సరానికి 10వేల చొప్పున ఐదు సంవత్సరాలు 50వేలు అందిస్తున్న ఆర్థిక సహాయం జగనన్న చేదోడు ద్వారా వృత్తిని అభివృద్ధి చేసుకునేందు వినియోగించుకోవాలని, చేదోడు మూడో విడత నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా లబ్దిదారుల ఖాతాలలో జమ చేసారని పేర్కొన్నారు. తిరుపతి జిల్లాలో 10813 మంది లబ్దిదారులకు రూ.10వేల వంతున వ్యక్తిగత ఖాతాలకు జమ చేయనున్న మొత్తం రూ.10.813 కోట్ల మెగా చెక్కును కలెక్టర్ అందజేసారు. జగనన్న చేదోడు 2020-21 గాను 8526 మంది లబ్దిదారులకు రూ.8.53కోట్లు, 2021-22 గాను 9392 మంది లబ్దిదారులకు రూ.9.39 కోట్లు లబ్ది చేకూరిందని గుర్తు చేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనకబడిన తరగతుల సంక్షేమ, సాధికార ఇన్‌చార్జి అధికారి భాస్కర్‌రెడ్డి, బి.సి. కార్పొరేషన్ ఏఇఏ బాబురెడ్డి, బి.సి. కార్పొరేషన్ సిబ్బంది, లబ్దిదారులు పాల్గొన్నారు.

# ప్రయాణికులే రైల్వేశాఖకు ప్రధాన ఆస్తులు

న ప్రయాణికుల భద్రతే లక్ష్యం - రైల్వే ప్రొటెక్షన్, పోలీసు అధికారులు



రేణిగుంట, జనవరి 30 ప్రభాతవార్త: రైల్వేశాఖకు ప్రయాణికులే ప్రధాన ఆస్తులని వారిరక్షణ కోసమే రైల్వే ప్రొటెక్షన్ ఫోర్సు, జీఆర్పీ పోలీసులు పని చేయాలని రైల్వే ప్రొటెక్షన్ ఫోర్సు, జీఆర్పీ పోలీసు ఉన్నతాధికారులు అన్నారు. రేణిగుంట రైల్వేస్టేషన్ వీఐపీ లాంజినందు సోమవారం రైల్వే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రైల్వే ప్రొటెక్షన్ ఫోర్సు, జీఆర్పీ పోలీసులు సంయుక్తంగా ప్రయాణికుల భద్రత, రైల్వే ఆస్తుల పరిరక్షణ, నేర నియంత్రణ తదితర అంశాలపై సమీక్షసమావేశం నిర్వహించారు. సమావేశం తిరుపతి జీఆర్పీ డీఎస్పీ షాను, రేణిగుంట ఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ బీసీవీ రాజు, అరక్కోణం ఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ ఏకే ప్రీత్, పర్యవేక్షనలో జరిగింది. సౌత్ సెంట్రల్‌రైల్వే, సదరన్‌రైల్వే నుంచి అధికారులు సమావేశానికి హాజరయ్యారు. సమావేశంలో అనేక అంశాలపై అధికారులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. తగు సలహాలను సూచనలు ఇచ్చారు. రైళ్ళలో నేరాలు జరగకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో చర్చించారు. రైల్వేశాఖ ప్రయాణికుల భద్రత కోసం ఎలాంటి సౌకర్యాలు సమకూరుస్తుందో తెలియజేశారు. సమావేశంలోని ఉన్నత అధికారులు మాట్లాడుతూ స్థానికులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత రైల్వే ఉద్యోగులుగా అందరిపై ఉందన్నారు. నేరాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రాత్రి సమయాల్లో విధి నిర్వహణలో ఉన్న వారు నిద్రపోకుండా విధులు నిర్వహించాలన్నారు. రైల్వేలు కల్పిస్తున్న సౌకర్యాలను ప్రయాణికులకు వివరించాలన్నారు. రైల్వే ఆస్తులకు, ప్రయాణికుల భద్రతకు ఆటంకం కలిగించిన వారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించకూడదన్నారు. సమావేశంలో తిరుపతి ఐపీఎఫ్ మధుసూదన్, రేణిగుంట ఐపీఎఫ్ సందీప్, తిరుపతి జీఆర్పీ సీఐ హేమసుందర్, రేణిగుంట జీఆర్పీసీఐ దేవేంద్రకుమార్, రేణిగుంట జీఆర్పీ ఎస్ఐ అనిల్, పలువురు ఎస్ఐలు, ఏఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఇచ్చిన హామీ మేరకు జగనన్న చేదోడు అమలు

- జడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు



చిత్తూరు, జనవరి 30 ప్రభాతవార్త:

ప్రజా సంకల్ప యాత్రలో భాగంగి సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కార్మికులు, కర్షకులకు ఇచ్చిన హామీ మేరకు జగనన్న చేదోడు పథకంను అమలు చేస్తున్నారని జడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు అన్నారు. 3వ విడత జగనన్న చేదోడు పథకం కింద ఒకొక్క లబ్దిదారుడికి 10 వేల రూపాయలు చొప్పున లబ్దిని సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సోమవారం పల్నాడు జిల్లా వినుకొండ నుండి నేరుగా వారి బ్యాంక్ ఖాతాలకు జమ చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా సచివాలయం నుండి వర్చువల్ విధానంలో జడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, కలెక్టర్ హరినారాయణన్, డిఆర్ఓ రాజశేఖర్, మేయర్ అముద, రాయలసీమ స్త్రీ శిశు సంక్షేమ శాఖ రీజినల్ చైర్‌పర్సన్ శైలజారెడ్డి, జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి, బిసి కార్పొరేషన్ ఇడి సుబ్రమణ్యం, ఇతర ప్రజాప్రతినిధులు, లబ్దిదారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రజా సంకల్ప యాత్ర పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జగనన్న చేదోడు పథకంను అమలు చేస్తున్నారన్నారు. ఈ పథకం ద్వారా అర్హత కల్గిన రజక, నాయిబ్రహ్మణ, టైలర్లకు ప్రతి ఏడాది 10 వేల రూపాయలు చొప్పున ఐదు సంవత్సరాలు 50 వేల రూపాయల ఆర్థిక సహాయం అందిస్తున్నారన్నారు. 3వ విడత జగనన్న చేదోడు పథకంలో భాగంగా జిల్లాకు చెందిన 9,477 మంది లబ్దిదారులకు 9.47 కోట్ల రూపాయలు లబ్దిదారుల బ్యాంకు ఖాతాకు జమ చేయడం జరుగుతుందన్నారు. కలెక్టర్ హరినారాయణన్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల సంక్షేమానికి సిఎం జగన్ నవరత్నాలు రూపొందించిసంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారన్నారు.

# ఏటి ఉత్సవానికి విస్తృత ఏర్పాట్లు

## ఏర్పాట్లను పరిశీలించిన చైర్మెన్

శ్రీకాళహస్తి, జనవరి 30 ప్రభాతవార్త

దక్షిణ కైలాసం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు సిద్ధమౌతుంది. ఈ మేరకు అధికారులు చక చకా ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. ఈ ఏడాది ఇటు శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి, మరో వైపు ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ఉత్సవాలను జనరంజకంగా నిర్వహించుటకు అధికారులను పరుగులు తీయిస్తున్నారు. ఫిబ్రవరి 5న జరిగే ఉత్సవాలకు భారీ ఎత్తున జనం తరలి వస్తారని భావించి చర్యలు తీసుకుంటున్నారు. ఇక నదిలో ప్రతి ఏడాది సద్యోముక్తి ఉత్సవంలో మహిళా భక్తులు ఉత్సవాల్లో తోసులాట చోటు చేసుకుంటుంది. ఈ సమస్యపై శ్రీనివాసులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇక్కడ ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. సోమవారం ఆలయ ఇఓ వికె సాగర్‌బాబు నిర్వహించిన సమీక్షల్లో ఏటి ఉత్సవం ఏర్పాట్లు గురించి ఇంజనీరింగ్ అధికారులను ప్రశ్నించారు.



సద్యోముక్తి కి ఏర్పాట్లు పూర్తి చేసామని ఇఇ మురళీధర్‌రెడ్డి వివరణ ఇచ్చారు. ఇఓ సాగర్‌బాబు నిర్వహించిన సమీక్షల్లో డెప్యూటీ ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి, ఎసి మల్లికార్జున్ ప్రసాద్, ఇఇ మురళీధర్‌రెడ్డి, డిఇఇ శ్రీనివాసులురెడ్డి, ఎఇఓ సతీష్‌మాలిక్, సూర్యప్రసాద్, సూపరింటెండెంట్‌లు నాగభూషణం యాదవ్, శ్రీహరి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్లు హరియాదవ్, సుదర్శనం, రాజేశ్వరి, సురేష్‌రెడ్డి, కిషోర్‌రెడ్డి, వెంకటస్వామి, ప్రధానార్చకులు సంబంధం గురుకుల్, ఉప ప్రధానార్చకులు కరుణాకర్‌గురుకుల్, పౌరోహితుడు అర్ధగిరి స్వామి, శానిటరీ ఇన్స్‌పెక్టర్ రఘునాథ్‌రెడ్డి వర్క్ ఇన్స్‌పెక్టర్ ప్రతాప్, సూర్య ప్రసాద్ పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## కుష్ఠువ్యాధి అవగాహనపై ర్యాలీ-కరపత్రాలు పంపిణీ



తొట్టంబేడు, జనవరి 30 ప్రభాతవార్త : కుష్ఠువ్యాధిపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని తొట్టం బేడు ప్రాథమిక ఇన్‌ఛార్జి వైద్యాధికారి తేజేశ్వరి అన్నారు. జాతీయ కుష్ఠువ్యాధి దినోత్సవ సందర్భంగా తొట్టంబేడు గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కారొకొల్లు గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ డాక్టర్ పవిత్ర ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. హెల్త్ సూపర్‌వైజర్ కామరాజు మాట్లాడుతూ జాతీయ కుష్ఠువ్యాధి నిర్మూలనలో భాగంగా స్పర్శ లెప్రసీ అవగాహన కార్యక్రమంలో గాంధీ మహాత్ముని వర్ధంతిని పురస్కరించుకుని ఫిబ్రవరి 13వ తేదీ వరకు జరుగుతుందన్నారు. స్పర్శ లెప్రసీ అవగాహన కార్యక్రమంపై కరపత్రాలను గ్రామ సర్పంచ్, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు, పాఠశాల ఉపాధ్యాయులు, ఎన్జీవోలు, ఆశా కార్యకర్తలు అందరికీ ఇచ్చి నేడు మహాత్మాగాంధీ వర్ధంతి రోజు నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు కుష్ఠువ్యాధిలేని దేశం కోసం అందరు కృషిచేయాలని కోరారు. మైక్రో బ్యాక్టీరియంలెప్రై అనే సూక్ష్మజీవి కారణమని, దగ్గులు, తుమ్ముల ద్వారా ఇది వ్యాపిస్తుందని ఈవ్యాధి శరీరంలో బయటపడడానికి 5 నుంచి 7సంవత్సరాల వరకు పడుతుందన్నారు. శరీరంపై స్పర్శలేని మచ్చలు, పొడలు, రాగిరంగు మచ్చలు లావుగా మారిన, నొప్పితో కూడిన నరాలు , కాళ్ళు చేతులులోని కండరాలలో బలహీనత, తిమ్మిర్లు, నొప్పి తెలియని పుండ్లు, కళ్ళుపూర్తిగా మూసుకోలేకపోవడం, ముక్కు, చెవితమ్మెలు మందంగా మారి ఉండడం, శరీరం పై బుడిపెలు ఉండడం కాలిపాదాలకు ఎండవేడిమికికానీ పదునైన వస్తువుల కలిగిన గాయాలు కానీ ఉంటాయన్నారు. ఎవరికి వారు తెలుసుకునేలా ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ఇంటింటికి తిరిగి తెలియజేస్తూ కుష్ఠువ్యాధి నిర్ధారణకు పరీక్షించడం, స్వీయ పరీక్షలు చేసుకునేలా చేయడమే ఈ కార్యక్రమం ఉద్దేశ్యమన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ లత, కార్యదర్శి విజయలక్ష్మి, గోపాలమిత్ర సుబ్ర మణ్యం, సూపర్‌వైజర్ కామరాజు, భారతీ, ఎఎన్ఎం రాధమ్మ, ఆశా కార్యకర్తలు చెంగాలమ్మ, బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రిరోజా గారు ..ఐరన్‌లెగ్ మీదే! : టిడిపి నేత ఉష



శ్రీకాళహస్తి, జనవరి 30 ప్రభాతవార్త : ఐరన్‌లెగ్ మంత్రి ఆర్‌కె రోజాదేనని తెలుగుదేశం పార్టీ తిరుపతి పార్లమెంటు మహిళా అధ్యక్షురాలు చక్రాల.ఉష అన్నారు. ఈమేరకు ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సమస్యలు తెలుసుకోవడానికి సైకో జగన్‌రెడ్డి పాలనను అంతమొందించడానికి తెలుగుదేశంపార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్ యువగళం పేరుతో పాదయాత్ర చేపడితే మంత్రి రోజా విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. నారాలోకేష ఏ హోదాలో యువగళం పాదయాత్ర చేస్తున్నారని రోజా ప్రశ్నించడం ఆమె అవివేకానికి నిదర్శనం అన్నారు. కుప్పంలో అనుకోకుండా దురదృష్ట వశాత్తు తారకరత్న గుండెపోటుకు గురైతే వైసిపి నేతలు ఈసంఘటనను నారాలోకేష్ పాదయాత్రకు ఆపాదించడం బాధాకరమన్నారు. మంత్రిహోదాలో ఉన్న రోజా ఇలాంటి వ్యక్తులే నైతిక విలువలు పాటించకుండా మాట్లాడడం సిగ్గుచేటన్నారు. సినిమాల్లో ఉన్న రోజాకు రాజకీయభవిష్యత్తు ప్రసాదించిన నారా చంద్రబాబునాయుడు కుటుంబంపై నేడు ఆమె ఉద్దేశ్యపూర్వకంగా విమర్శలు చేస్తోందన్నారు. రాబోవు రోజుల్లో ప్రజలే ఆమెకు గుణపాఠం చెప్తారన్నారు. సమావేశంలో తెదేపా రాష్ట్ర మహిళా కార్యనిర్వాహక కార్యదర్శి రేణుకాదేవి, శ్రీలక్ష్మి, మునిరాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

## సిహెచ్ఓ రెండో ఓరియేషన్ శిక్షణా కార్యక్రమం



తిరుపతినగరం,జనవరి 30 ప్రభాతవార్త : నేషనల్ హెల్త్‌లో భాగంగా రోగులకు అందించవలసిన సేవల పట్ల ఎంఎల్‌హెచ్‌పి భారత్ సిహెచ్ఓ ఎక్స్పాండెడ్ ప్యాకేజ్ ఆఫ్ సర్వీసస్ (చెవి, ముక్కు, గొంతు, కంటి,నోటి, మానసిక సమస్యలు ఎమర్జెన్సీ అండ్ పాలిఏటివ్ కేర్)పై శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీహరి ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా పరిధిలోని మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్స్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్‌కు శిక్షణా ఇచ్చారు. ఈ సందర్భంగా డిఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీహరి మాట్లాడుతూ రోగులకు ఎలా వైద్యం అందించాలి అనే అంశంపై శనివారం వరకు ఈ రెండవ ఓరియేషన్ కార్యక్రమం వుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రోగులు వైఎస్‌ఆర్ హెల్త్ క్లీనిక్‌కు వచ్చి తమ పేర్లను నమోదు చేసుకుని తమ ఆరోగ్య పరిస్థితిని బట్టి వైద్యులు ఆ రోగికి ఏ వైద్య సేవలు అవసరమో తెలుసుకొని చికిత్స అందించాలన్నారు. అదే విధంగా ఆరోగ్యశ్రీ పథకం ద్వారా శస్త్ర చికిత్సలు చేయించుకొన్న వారికి ఫోలో ఆఫ్ సేవలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎంఓ., డిఎల్‌ఏటిఓ తదితరులు పాల్గొన్నారు.

## కుష్టు అంటు వ్యాధి కాదు

### మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివాజీ ప్రయాగ్



చంద్రగిరి, జనవరి 30 ప్రభాతవార్త: కుష్టు అంటు వ్యాధి కాదని కొటాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివాజీ ప్రయాగ్ అన్నారు. మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని వైద్య సిబ్బంది స్పర్శ కుష్టు వ్యాధి అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా జనవరి 30 నుండి ఫిబ్రవరి 13 వరకు 15 రోజుల పాటు కుష్టు వ్యాధి పట్ల ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జాతీయ కుష్టు నిర్మూలనా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కుష్టు వ్యాధి రహిత మండలంగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. కుష్టు వ్యాధి పట్ల అనుమానిత నలుపు, తెలుపు రంగు పొడలు కనుబొమ్మలు, చెవులు, చర్మం స్పర్శలేని పక్షంలో వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు.

## కుష్టు రహిత సమాజాన్ని నిర్మిద్దాం..! డాక్టర్ పూర్ణ

రామచంద్రాపురం, జనవరి 30 ప్రభాతవార్త: కుష్టు రహిత సమాజాన్ని నిర్మిద్దామని కుప్పం బాదూరు వైద్యుడు డాక్టర్ పూర్ణ అన్నారు. సోమవారం మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని కుప్పం బాదూరులో ర్యాలీ నిర్వహించి, విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుష్టు అంటువ్యాధి కాదన్నారు. వ్యాధి గ్రస్థులను ఆప్యాయతతో పలకరించాలన్నారు. నలుపు, తెలుపు రంగు పొడలు కనుబొమ్మలు, చెవులు, చర్మం స్పర్శలేని పక్షంలో వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. పిహెచ్ఓ ఎం.వి.ప్రసాద్, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి దాతల ఆర్థిక వితరణ

### ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డి



చంద్రగిరి, జనవరి 30 ప్రభాతవార్త: చంద్రగిరి గ్రామదేవత శ్రీమూలస్థాన ఎల్లమ్మ వారి ఆలయ పునర్నిర్మాణానికి దాతలు తమ వంతు వితరణలతో సహకరిస్తున్నట్లు ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా రామచంద్రాపురం మండలం, అనుప్పల్లి పంచాయతీ, రేఖలచేను గ్రామానికి చెందిన కొర్లకుంట కేశవులు రెడ్డి కుమారుడు కొర్లకుంట గురునాథ్ రెడ్డి సోమవారం రూ.1,11,116/-లు చెక్‌ను ఆలయ చైర్మన్, ఈఓకు అందజేశారు. అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ పనులకు వినియోగించాలని కోరుతూ చెక్‌ను అందజేసినట్లు తెలిపారు. అదేవిధంగా ప్రవాస భారతీయుడు డాక్టర్ సోమశేఖర్ నాయుడు రూ.1,01,116/-లు, హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ చరణ్ రెడ్డి రూ.1,01116/-లు, ఐతేపల్లికి చెందిన వంశీధర్ రూ.50 వేలు, వెంకటముని రూ.10 వేలు వితరణ చేసినట్లు వెల్లడించారు. ఇప్పటి వరకు దాతల సహకారంతో ఆలయ పునర్నిర్మాణ పనులకు ఈ సందర్భంగా ఆలయ చైర్మన్‌తో పాటు ఈఓ పుట్టా రామకృష్ణారెడ్డి దాతల కుటుంబ సభ్యులకు అమ్మవారి దర్శన ఏర్పాట్లు గావించి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఏకవీర సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రతాప్ స్వామిజీ, మదన్‌మోహన్ రెడ్డి, సుబ్రమణ్యం రెడ్డి, మాజీ ఎంపిటిసి సి.ఎం.కేశవులు (డాక్యుమెంట్ రైటర్ బుజ్జి),బలరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఈ క్రాపింగ్‌పై నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు : జెసి



రామచంద్రాపురం, జనవరి 30 ప్రభాతవార్త: రైతులు పండించే పంటలను ఈ క్రాపింగ్‌లో చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని జెసి బాలాజీ హెచ్చరించారు. సోమవారం పి.వి.పురం, కె.కె.వి.పురం పంచాయతీలలో ఈ క్రాపింగ్‌లను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ క్రాపింగ్ బుకింగ్ ఆధారంగానే ప్రభుత్వం నుండి సంక్షేమ పథకాలు రైతులకు అందగలవన్నారు. రైతుల పొలాల వద్దకు వెళ్ళి ఈ క్రాపింగ్ నమోదు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జి.సి.వెంకటేశ్వర్లు, ఏఓ స్రవంతి, విఆర్ఓ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మహాత్మాగాంధీ వర్ధంతి వేడుకలు!



తిరుపతి ప్రెస్‌క్లబ్,జనవరి 30 ప్రభాతవార్త: సోమవారం స్థానిక గాంధీరోడ్డులోని కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ కార్యాలయం నందు ట్రస్ట్ చైర్మన్ డా॥పిసి.రాయులు ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ 75వ వర్ధంతి వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు.కార్యక్రమంలో భాగంగా గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.అనంతరం వెయ్యిమంది పేదలకు అన్నదానం చేశారు. డా॥పిసి.రాయులు మాట్లాడుతూ గత 22 సం॥లుగా తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నామన్నారు. అనంతరం ముఖ్య అతిథిగా విచ్చేసిన బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ అందరూ బాగుండాలి అందులో మనం ఉండాలి అన్న సూక్తిని పాటిస్తూ డా॥పిసి.రాయులు చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేత అజయ్‌కుమార్,ట్రస్ట్ డైరెక్టర్ రుద్రరాజు శ్రీదేవి,గాదె సుబ్రహ్మణ్యంరెడ్డి,బండి మధుసూధన్‌రెడ్డి మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## రేపటి నుండి ఎస్వీ జూలో నూతన ధరలు -క్యూరేటర్ సెల్వం వెల్లడి

తిరుపతి ప్రెస్‌క్లబ్,జనవరి 30 ప్రభాతవార్త: రేపటి రోజు బుధవారం నుండి స్థానిక శ్రీ వెంకటేశ్వర జూలాజికల్ పార్కులో నూతన ధరలు అమల్లోకి వస్తున్నట్లు జూపార్కు క్యూరేటర్ సెల్వం తెలిపారు. సోమవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ ఈనెల 19వ తేదీ విశాఖపట్నంలో జరిగిన 12వ జూ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(జాప్) సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. పెరిగిన ధరల వివరాలను ఆయన వివరిస్తూ 31 జనవరి వరకు ఉన్న జూపార్కు ప్రవేశ ధర పెద్దలకు 50,పిల్లలకు 10 రూ॥లు ఉండగా ఫిబ్రవరి 1 నుండి 70 రూ॥లు,30 రూ॥లని,బ్యాటరీ వాహనాలకు పెద్దలకు 50,పిల్లలకు 30 రూ॥లుగా ఉన్నదానిని నేడు 70,50 రూ॥లుగా, అలాగే విదేశీ పర్యాటకులకు పెద్దలకు 200,పిల్లలకు 100 రూ॥లు,నాలుగు చక్రాల వాహనాలకు ప్రస్తుతం 500 ఉండగా, అది 750 రూ॥లకు పెంచామన్నారు. అదేవిధంగా వీడియో కెమెరాకు,స్టిల్ కెమెరా, సెల్‌ఫోన్‌లకు ప్రస్తుతం 150,30 రూ॥లు ఉన్న టికెట్ ధరను 200,50 రూ॥లుగా ధర పెంచడం జరిగిందన్నారు.

## పందుల యజమానులతో అధికారుల సమావేశం : వార్తా ప్రభావం



రేణిగుంట, జనవరి 30 ప్రభాతవార్త: అధిక సంఖ్యలో చనిపోతున్న పందులు, ఆందోళనలో ప్రజలు అనే శీర్షికతో 28వ తేదీ వార్త దినపత్రికలో ప్రచురించిన కథనానికి అపూర్వస్పందన లభించింది. ఈ నేపథ్యంలో పశు వైద్యాధికారులు సోమవారం రేణిగుంట పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ నాగేషం అధ్యక్షతన వైస్ ఎంపీపీ సుజాత సమక్షంలో పందుల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఏరియా పశువుల వైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డా. సునీత, ఆర్ మల్లవరం డిస్పెన్సరీ పశువుల వైద్యులు డా.స్రవంతి వీణ సమావేశంలో పలు సూచనలు చేశారు. పందులు జబ్బు పడినప్పుడు రోగాలకు గురైన వాటిని ఇతర వరాహాలకు దూరంగా ఉంచాలన్నారు. ఇది ఇలా ఉండగా ఏరియా వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ డా. సునీత ఆదేశాల మేరకు ఆర్ మల్లవరం డిస్పెన్సరీ వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డా. స్రవంతి వీణ రేణిగుంట గ్రామంలో పర్యటించి పందుల యజమానుల ఇళ్ళకు వెళ్లి వాటి మరణాలపై ఆరా తీశారు. రోగాలు రాకుండా వాటికి యాంటీబయాటిక్ మందులు అందజేశారు. పందులకు వ్యాధులు రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు.

## లింగ అసమానతలు అభివృద్ధికి అడ్డంకులు



తిరుపతి (విద్య), జనవరి 30 ప్రభాతవార్త : మహిళా సాధికారతలో పురుషుల భాగస్వామ్యాన్ని, బాధ్యతను తెలియజేసే నిమిత్తమై శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని మహిళ అధ్యయన విభాగం, కేంద్ర విభాగాధిపతి డా. నీరజ నిర్వహిస్తున్న రోల్ ఆఫ్ బాయ్స్ అండ్ జెండర్ ఈక్వాలిటీ అనే వర్క్ షాప్ సిరీస్‌లో భాగంగా కార్వేటి నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని పురుష విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ సమాజంలో నెలకొన్న జెండర్ అసమానతల వల్ల కేవలం మహిళలే కాకుండా పురుషులు కూడా బాధింపబడుతున్నారని, అవాస్తవిక పురుషత్వ, స్త్రీతత్వ భావజాలాన్ని పిన్న వయసు నుండి పిల్లల పైన రుద్దడం ద్వారా అనేక రకాల అసమానతలకు దారితీసి స్త్రీ పురుషులు ఇరువురికి హాని కలిగిస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. సీతా విజయులు రెడ్డి, తెలుగు విభాగ అధ్యాపకులు డా. వెంకటేష్, విమెన్ ఎంపవర్మెంటు సెల్ కన్వీనర్ లత, మహిళా అధ్యయన కేంద్ర రీసెర్చ్ అసిస్టెంట్ ప్రీతి, విద్యార్థులు పాల్గొన్నారు.

## చిలకం చిత్రపటానికి నివాళి అర్పించిన కేంద్ర మంత్రి



విజయపురం, జనవరి 30 ప్రభాతవార్త : భారతీయ జనతా పార్టీ మాజీ అధ్యక్షుడు స్వర్గీయ చిలకం రామచంద్రారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సోమవారం నివాళి అర్పించారు. తమిళనాడు పర్యటనలో వున్న మంత్రి చెన్నైలోని రామచంద్రారెడ్డి కుమారుడు చిలకం ఈశ్వరప్రసాద్ ఇంటికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిలకం మచ్చలేని మనిషని, బిజెపి అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు.

## అవార్డు గ్రహీత డిప్యూటీ తహసీల్దార్‌కి ఘన సన్మానం



కేవీబీ పురం, జనవరి 30 ప్రభాతవార్త: తిరుపతి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా రిపబ్లిక్‌డే సందర్భంగా ఉత్తమ డిప్యూటీ తహసీల్దార్ అవార్డు అందుకున్న కేవీబీ పురం మండల డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్న పెద్దేశి మునిరత్నంరెడ్డిని స్థానిక మండల కార్యాలయంలో సోమవారం శ్రీకాళహస్తి నియోజకవర్గ వన్నెకుల క్షత్రియ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కారూరు జనార్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సోమవారం స్థానిక మండల కార్యాలయంలో శ్రీకాళహస్తి నియోజకవర్గ వన్నెకుల క్షత్రియ సంక్షేమ సంఘ అధ్యక్షుడు కారూరు జనార్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలోశ్రీకాళహస్తి దేవస్థానం తీర్థ ప్రసాదాలు, శేషావస్త్రం, గజమాలతో అవార్డు గ్రహీత మునిరత్నంరెడ్డిని ఘనంగా సన్మానించారు. ప్రధాన కార్యదర్శి శ్రీకాళహస్తి దేవస్థానం మాజీ ట్రస్టు బోర్డు మెంబరు సుబ్రహ్మణ్యంరెడ్డి మాట్లాడుతూ ఈ ఉత్తమ అవార్డు లభించడానికి ఆయన క్రమశిక్షణతో ప్రజలకు చేసిన సేవలను గురించి కొనియాడారు. అందుకు సహకరించిన స్థానిక తహసీల్దార్ ద్వారకానాథరెడ్డిని కూడా సంఘం తరపున ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ద్వారకానాథరెడ్డి, సంఘ అధ్యక్షులు జనార్ధన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యంరెడ్డి, ఉపాధ్యక్షుడు నెల్లూరు సుబ్రహ్మణ్యంరెడ్డి, పట్టణ అధ్యక్షులు జ్ఞానప్ప విజయకుమార్‌రెడ్డి, భవన నిర్మాణ కమిటీ అధ్యక్షులు మన్న సముద్రం మస్తాన్‌రెడ్డి, కేవీపీ పురం పీఎం భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## యువగళం పాదయాత్రకు ప్రజలు బ్రహ్మరథం : గాలి భానుప్రకాష్



నగరి, జనవరి 30 ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, యువనేత నారా లోకేష్ రాష్ట్ర భవిష్యత్ కోసం చేపడుతున్న యువగళం పాదయాత్రకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ తెలిపారు. యువగళం పాదయాత్ర 4వ రోజు పలమనేరు నియోజకవర్గంలో నారా లోకేష్‌తో కలిసి పాల్గొన్నారు. పాదయాత్రలో అన్ని వర్గా ప్రజలను లోకేష్ కలుస్తున్నారు, వారి బాధలు, కష్టాలు వింటున్నారు. వైసీపీ పాలనలో మోసపోయిన వర్గాలకు భరోసా ఇస్తూ కదులుతున్నారని, యువత భవిష్యత్ కోసం చేస్తున్న పాదయాత్రలో యువత పెద్ద సంఖ్యలో పాల్గొని సంఘీభావం తెలుపుతున్నారని తెలిపారు.

## మంత్రి రోజా సమక్షంలో టిడిపి నాయకులు వైసీపీలోచేరిక



నగరి, జనవరి 30 ప్రభాతవార్త: మంత్రి రోజా సమక్షంలో నగరి మండలం గుండ్రాజుకుప్పం గ్రామ తెలుగుదేశం పార్టీకి చెందిన మాజీ ఎంపీటీసీ, ప్రస్తుతం వార్డు మెంబరు జమున అనుచరులు బాషా, జయరాజు, మనోహర్, సోము, ఎస్. కుమార్, రాము, రఘు, రమేష్, వెంకటేశులు వీరితో పాటు 70 మంది వైసీపీలో చేరారు. మంత్రి రోజా వారికి కండువా కప్పి సాదరంగా వైసీపీ పార్టీలోకి ఆహ్వానించారు. నగరి నియోజకవర్గ అభివృద్ధికి మంత్రి చేస్తున్న కృషిని చూసి తెలుగుదేశం పార్టీ నుంచి వైసీపీ లోకి చేరినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో మండల ఎంపీపీ, వైస్ ఎంపీపీ, వైసీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## లెప్రసీ రహిత సమాజం కోసం సహకరించండి



వడమాలపేట, జనవరి 30 ప్రభాతవార్త: కుష్టు వ్యాధి రహిత సమాజం కోసం ప్రజలందరూ సహకరించాలని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి చక్రపాణి కోరారు. సోమవారం వడమాలపేటలో కుష్టు వ్యాధి నిర్మూలన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 13 తేదీ వరకు మండలంలో కుష్టు వ్యాధిపై సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ర్యాలీలో వైద్యులు దివ్య, భానురేఖ, కమ్యూనిటీ హెల్త్ అధికారి పురుషోత్తంరెడ్డి, సూపర్‌వైజర్ చంద్రమోహన్, స్టాఫ్ నర్సులు మరియమ్మ, ఫైరోజ, ఉషపాల్గొన్నారు.

## తొట్టంబేడు ఇన్‌ఛార్జి వైద్యాధికారిణిగా తేజేశ్వరి



తొట్టంబేడు, జనవరి 30 ప్రభాతవార్త : తొట్టంబేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణిగా డాక్టర్ తేజేశ్వరిని ఇన్‌ఛార్జిగా నియమిస్తూ డిఎంహెచ్ఓ డాక్టర్ శ్రీహరి ఉత్తర్వులు జారీచేశారు. తిరుపతిరూరల్ రామచంద్రాపురం మండలం కుప్పంబాదూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న ఆమెను ఇక్కడ ఇన్‌ఛార్జిగా నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న ఇద్దరు విధి నిర్వహణలో మద్యం సేవిస్తూండడం పత్రికల్లో వార్త ప్రచురితం కావడంతో వారిని వైద్యఆరోగ్యశాఖకు సరెండర్‌చేసి ఇన్‌ఛార్జి వైద్యాధికారిగా తేజేశ్వరిని నియమించారు.

## శ్రీకాళహస్తీశ్వరుని సేవలో ప్రజా ప్రతినిధులు



శ్రీకాళహస్తి,జనవరి 30 ప్రభాతవార్త : దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి చెందిన శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధిలో సోమవారం గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ నాగమనోహర్ నాయుడు కుటుంబసభ్యులు మిత్రులతో దర్శనానికి వచ్చారు. కాగా విజయనగరం జిల్లా నెలిమర్ల శాసన సభ్యుడు బడ్డుకొండ అప్పల నాయుడు కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. వారికి ఆలయంలోని అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. దర్శనానంతరం మృత్యుంజయ స్వామి ఆలయం వద్ద వారికి వేదపండితులతో ప్రత్యేకాశీర్వ చనాలు అందించారు. ఏర్పాట్లను పిఆర్ఓ వెంకటస్వామి,శ్రీనాథ్,టెంపుల్ ఇన్స్‌పెక్టర్ సుదర్శనం, సురేష్‌రెడ్డి ఏర్పాట్లు చేపట్టారు.

## కాశీవిశ్వనాధుని సేవలో అంజూరు



శ్రీకాళహస్తి,జనవరి 30 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు,కొందరు ధర్మకర్తల మండలి సభ్యులు కాశీవిశ్వనాధుని దర్శించుకున్నారు. మూడు రోజులుగా వారణాసిలో ఉన్న వారు ధార్మికతతో అక్కడి ఆలయాలను దర్శించుకుంటున్నారు.కాశీలోని ప్రతి ఆలయాన్ని సందర్శించారు. అక్కడి పూజా విధానాలను పరిశీలించారు. చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులుతో పాటు బోర్డు సభ్యులు కొండూరు సునీత,రమాప్రభ,కొండూరు నరసింహారాజు (నంద), భాస్కర్, మాజీ బోర్డు సభ్యుడు పిఎం చంద్ర దంపతులు ఆయనతో పాటు ఉన్నారు.

## కాసరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో ర్యాలీ

తొట్టంబేడు, జనవరి 30 ప్రభాతవార్త : కాసరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా కుష్టువ్యాధిపై అవగాహన కార్యక్రమం స్పర్శ కార్యక్రమంపై ర్యాలీ చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి గ్రామంలో కుష్టువ్యాధిపైన సర్పంచ్ సందేశం మరియు కలెక్టర్ సందేశాన్ని గ్రామసభలలో అందరికి చదివి వినిపించారు. ఈ కార్యక్రమం ఈనెల 30వతేదీ నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు జరుగుతుందన్నారు. సర్పలేని రాగి వర్ణపు మచ్చలు ఉన్న వారికి ఎండిటి మందులు గవర్నమెంట్ హాస్పిటల్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. అలాంటి వారిని చులకనగా చూడవద్దని వైద్యులు డాక్టర్ అనూష, డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డిలు తెలిపారు. ర్యాలీలో సూపర్‌వైజర్ అమ్మణమ్మ, హెల్త్ అసిస్టెంట్ వెంకటేష్, ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

## యువ గళంలో శ్రీకాళహస్తి నాయకులు



శ్రీకాళహస్తిరూరల్,జనవరి 30 ప్రభాతవార్త : తెలుగుదేశం జాతీయ కార్యదర్శి నారాలోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రకు శ్రీకాళహస్తికి చెందిన పలువురు నాయకులు మద్దతుగా ఆయనతో పాటు నడుస్తున్నారు. సోమవారం జిల్లా అధికార ప్రతినిధి రంగినేని చెంచయ్యానాయుడు తమ సహచరులతో కలసి పాల్గొన్నారు. సోమవారం పలమనేరులో జరిగిన పాదయాత్రలో శ్రీకాళహస్తి నాయకులు పాల్గొన్నారు. నాలుగురోజులుగా పాదయాత్రలో నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయన పాదయాత్రలో కాలు బెణికింది. దాంతో శ్రీకాళహస్తి నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రంగినేని చెంచయ్యనాయుడు మాట్లాడుతూ యువ నాయకుని పాదయాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుంటూ ప్రభుత్వంలో చోటు చేసుకున్న తప్పిదాలను ఎండగట్టుతూ పాదయాత్రను సాగిస్తున్న లోకేష్ యాత్రతో 2024లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావటం ఖాయం అన్నారు.

## స్టాండర్డ్ ప్రమాణాలు కలిగిన వస్తువులనే కొనుగోలు చేయాలి : డిఆర్వో

తిరుపతిరూరల్, జనవరి30 ప్రభాతవార్త: వినియోగదారులు స్టాండర్డ్ ప్రమాణాలు కలిగిన వస్తువులనే కొనుగోలు చేయాలని డి ఆర్ ఓ శ్రీనివాసరావు తెలిపారు. వినియోగదారులు, అధికారులు బి.ఐ.ఎస్ చట్టం-2016 మేరకు గుర్తింపు పొందిన 458 వస్తువుల కొనుగోలులో దైనందిన జీవితంలో మోసపోరాదని, ఇండియన్ స్టాండర్డ్ ప్రమాణాలు (ఐ.ఎస్.ఓ) పాటించాలని, ప్రభుత్వ శాఖలలో తప్పనిసరి అమలైయ్యేలా చూడాలన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బి.ఐ.ఎస్) విజయవాడ నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో డిఆర్వో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బి.ఐ.ఎస్. జాయింట్ డైరెక్టర్లు సుజాత, రమాకాంత్ సాగర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వస్తువుల కొనుగోలు విషయంలో పాలించాల్సిన జాగ్రత్తలు, లైసెన్స్ లేని విక్రేతలకు జైలుశిక్ష, జరిమానాలు వంటివి ఉంటాయని వినియోగదారులు అవగాహనతో బి.ఐ.ఎస్‌లో లైసెన్స్, గుర్తింపు పొందిన వస్తువులు నాణ్యాతా ప్రమాణాలు ఉంటాయని, వాటిలో సిమెంట్, స్టీల్, మెడికల్ ఎక్విప్మెంట్లు, బంగారం, తినుబండారాలు, ఎలక్ట్రికల్ పరికరాలు ప్రధానమని తెలిపారు. కొనుగోలు సమయంలో బి.ఐ.ఎస్ కేర్ యాప్ మొబైల్‌లో డైన్లోడ్ చేసుకుని పరిశీలించాలని, నాణ్యతా ప్రమాణాలు లేకపోతే మొబైల్ యాప్ నుండి ఫోటో కంప్లైంట్ చేయవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఓ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## గాంధీ ఆశయసాధనకు కృషిచేద్దాం



తిరుపతి,జనవరి 30ప్రభాతవార్త: దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడానికి సత్య,అహింస మార్గంలో పోరాటం చేసిన మహాత్మాగాంధీ ఆశయ సాధనకు నేటి యువత,నాయకులు అందరూ కృషి చేయాలని బిజెపి నేత గుండాల గోపీనాధరెడ్డి పిలుపు నిచ్చారు. సోమవారం మహాత్మాగాంధీ వర్ధంతి పురస్కరించుకుని నగరంలోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్యం కోసం ప్రధాని మోదీ కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు గుండాల గోపీనాధరెడ్డి, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, ఏవన్ మస్తాన్, సుబ్రమణ్యం యాదవ్, కవిత, మల్లారపు రవిప్రసాద్, దీపక్‌యాదవ్ కళాకారులు సుబ్రమణ్యంరెడ్డి, శోభ, ఆర్ఎంఎస్ భాస్కర్, చెంగారెడ్డి పాల్గొన్నారు.

## మహాత్ముని ఆశయాలకు కేంద్ర,రాష్ట్రప్రభుత్వాలు తిలోదకం

### :కాంగ్రెస్ ఎస్సీసెల్ కోచైర్మన్ చిట్టిబాబు



తిరుపతి,జనవరి 30ప్రభాతవార్త: కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వాలు మహాత్మా గాంధీ ఆశయా లను తుంగలోతొక్కుతున్నాయని కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర ఎస్సీసెల్ కోచైర్మన్ గౌడపేరు చిట్టిబాబు విమర్శించారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పేద,బడుగు, బలహీన వర్గాలకు, కార్మికులకు, కర్షకులకు వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ మళ్ళీ ప్రజల బలంతో అధికారంలోకి వస్తుందని జోస్యం చెప్పారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎస్సీ,ఎస్టీలకు తీవ్ర ద్రోహం చేస్తుందని ఆరోపించారు. అంతకుముందు గాంధీ విగ్రహానికి ఎస్సీ సెల్ కోచైర్మన్ గౌడపేరు చిట్టిబాబు ,తిరుపతి జిల్లా అధ్యక్షుడు చిత్తూరు శివశంకర్, నాయకులు తలారి గోపి, రంజిత్ ,సత్యమూర్తి,వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## గాంధీజీ సత్యశీలతే ఆయన్ని మహాత్ముని చేసింది

రేణిగుంట, జనవరి 30 ప్రభాతవార్త: రేణిగుంట బాలికల ఉన్నత పాఠశాలలో మహాత్మగాంధీ 75 వర్ధంతి సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఐదు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా స్రవంతి నాయకుడు ఓ.వి.రమణలు మాట్లాడుతూ భారతదేశంలో మత సామరస్యానికి బీజం వేసిన మొట్ట మొదటి వ్యక్తి మహాత్మ గాంధీ అన్నారు. ప్రధాన మంత్రి లాంటి అత్యున్నత పదవి ఆయనను వరించినా వద్దని సాధారణ జీవితాన్ని గడిపిన మహోన్నతుడిగా గాంధీజీని అభివర్ణించారు. అలాంటి మహా నాయకుడు తుపాకి తూటాలకు బలి కావడం చాలా బాధాకరమన్నారు. ఐద్వా నాయకురాలు ఈశ్వరి, సాహితీ, ఉపాధ్యాయులు షాకీరా, శిరీష తదితరులు పాల్గొన్నారు.

